# పాత్రవిపత్తు

[ క థా ని క ]

= శ్రీ శ్రీరంగం నారాయణబాబు =

కీర్తిశేషుడు పిరాండెల్లో యిటాలియన్ దేశపు కవి. ఇటలీ నవ్యసాహిత్యంలో యీాయననాటకాలు గొప్ప పలుకుబడిని సంపాదించుకున్నాయి. నాటకాలకు యీాయన సిద్ధహస్తుడు. 'పాత్రవిపత్తు' అనే కథల సంపుటిలో ౧౯ కథలు గలవు. మొదటి కథ నామధేయమే పుస్తకానికి చేయబడింది. ఈయనచే రచింపబడిన 'ఆరుపాత్రల అన్వేషణ; రచయితకొరకు' అనే మహానాటకానికి ఈకథ మాతృక. ఈయనకథలు మానవ స్వభావంలో ఉండే దోషాలనూ, అల్పత్వాన్నీ చిత్రిస్తాయి. అంతర్వాహినిగా చిత్తానికి చాంచల్యమే నైసర్గికమైనా, జయించామనీ, చిత్త స్థైర్యము కలదనీ గర్వించేవారి మనోవైకల్యాన్ని సూచించడంలో పిరాండెల్లో ప్రతిభ గలవాడు. ఆ ప్రతిభ ఈ 'పాత్రవిపత్తు' లో విశదంగా కనపడుతూవున్నది. ఆ కథకు ఈ క్రింది కథ యథేష్టానుకరణ. భాషా సంప్రదాయాలను, జాతీయాలను పోగొట్టగూడదనీ, తెనుగుదనం తెచ్చిపెట్టవలెననీ నేనిందులో కొంత స్వేచ్ఛ అవలంబించినాను. అంతే. కథాశిల్పమూ, కల్పనలూ అంతా ఆయనవే.

— శ్రీ. నా.

తెనుగుసారస్వతంలో వాస్తవికయుగం చిన్నకథ పుట్టుకతోనే ప్రారంభమైంది. భావములో, పాత్రల నేరుకోడంలో సామాన్యజీవనంనుంచి ఏరుకొన్న భిన్నభిన్న జీవితపరమాణువులే కథాకల్పనకు శరీరములైనవి. వివిధజీవితవీథులలో దీపాలై వెలిగే అనుభూతులను అవగాహనచేసుకొనే ప్రయత్నము ప్రతిఉత్తమరచయితకూ ప్రథమసోపాన మైంది. వివిధ మానవుల మనోగతభావాలనూ ఏరుకొని, నాకథలలోని పాత్రలకు ప్రాణదానంచేయడంకోసం నేను ప్రతిఆదివారమూ అనేకమంది జనులను - బీదవారిని నాయింటికి రావించి వారి జీవితాలు, ఆదర్శాలు, సుఖదుఃఖాలను ప్రశ్నలమూలకంగా గ్రహించి పొందుపరచి, వారికి తృణమో పణమో ముట్టజెప్పి పంపి కథలలో వాస్తవికతను చూపించడం నాఅలవాటు. ప్రతిఆదివారమూ ఉదయం ఎనిమిదిగంటలుమొదలు ఒంటిగంటవరకు- అంటే అయిదుగంటలకాలం నేను యీాగోష్ఠిలో గడిపేవాడిని. నాకు యీాగోష్ఠి జరిగినంతసేపూ దుష్టసావాసంలో ఉండక తప్పేదికాదు. నాప్రాలుబ్ధ మేమిటోగాని, నాదగ్గరకు వచ్చే జనులు యావన్మందీకూడా చాలా విసుగుదల చూపేవారు. వారు ఒక తేరీతిగా ఏదో మానసికరోగంతో బాధపడుతూన్నవారో, లేక జీవితపరిధుల్లో క్లిష్టపరిస్థితులలో చిక్కుకొన్నవారో అవడంచేత వారితో వేగడం కష్టంగా ఉండేది. వచ్చిన జనుల నామధేయాలు వ్రాసుకోడం, పేర్లతోపాటు వారి జీవితానుభవాలు, వాతావరణం, వారి ఆశయాలూ తెలుసుకోడంకోసం వారిని అనేకప్రశ్నలు వేసి నిజ మనోగతాన్ని తెలుసుకొందే నేను వదలిపెట్టేవాడను గాను. నేను ప్రశ్నలు వేసేవేళల్లో వారు మర్యాదగా నన్ను ఎన్ని చికాకులు పెట్టినా భరించేవాడనుగాని, మాయచేసేందుకు ప్రయత్నిస్తేమాత్రం మండిపడేవాడను.

నాదగ్గరకు వచ్చే జనులు నేను ప్రశ్నలు వేసే వేళల్లో అంతమందీ ఒకవిధమైన మంకుతనాన్ని చూపించడంగాని, లేదా ప్రశ్నలకు మొండిగా జవాబివ్వటం గాని చేసేవారు. అందుకు కారణం ప్రథమపరి

చయంలో చేయతగిన భోగట్టాలు కాకపోవడం అయి ఉంటుం దని నానమ్మకము. కాని శాంతంగా, మర్యాదగా నేను వేసే ప్రశ్నలయొక్క ఔచిత్యం నేను వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నం చేసేవాడను. మనకు తగిన అవకాశాలు లేనప్పుడు యింతవారి మవుదాం అంతవారి మవుదాం అనుకోడం హాస్యాస్పదం అవుతుంది. నా దగ్గరకు వచ్చే మానవులకు యీసంగతి బొత్తిగా అవగాహన కాదు నేను చెప్పినా. సత్ హృదయం కలిగినవాణ్ణి కాబట్టి, పాపం, వారి దీనస్థితి చూచి వారికోసం విచారిస్తాను. జీవితంలోకలిగే కొన్ని దురదృష్టాలేఅయినా, కరుణచూపించవలిసినవే అయినా, కరుణకుముందు మన నవ్వునే అవి రేపుతాయి. నా కథలలోని పాత్రలు నాకంటె కఠినుడు, రాతిగుండె కలిగిన రచయిత లేడని నన్ను నిందిస్తాయి. సహృదయత గల విమర్శకులు అవసరం. నానవ్వు తెర వెనుక ఎంత కరుణరసం ఉందో తెలుసుకున్నవా డేడీ?

ఈనాడు సహృదయత గల విమర్శకులు మృగ్యం!

*   *   *   *

మాయింటికి వచ్చే జనులు రకరకాలవారు. కొంతమంది, ప్రశాంతంగా కూర్చున్న జనులను త్రోసుకొనివచ్చి, దబాయించి, ఆలస్యమవుతున్న దని గర్జించేవారు. అటువంటివారిని, వెంటనే ప్రశ్నలు వేయకుండా, సంజాయిషీ పుచ్చుకోకుండానే పంపివేసేవాడను. అటువంటివారు మరల కొంతకాలం పోయాక వచ్చి, ఆనాటి తమ అపరాధాన్ని మన్నించమని ప్రార్థించేవారు. కాని నాకు వేళా సమయం దొరికేవరకూ కనిపెట్టుకొనిఉండమనటం నాఅలవాటు.

వచ్చినవారిని ఒక్కొక్కరినే ప్రశ్నిస్తూ, వ్రాసుకుంటూ వెళ్లడంలో అయ్యే కాలవిలంబన కోర్చలేక నాపాత్రలు నాబోటి రచయిత యింకొకని దగ్గరకు పోవడం అలవాటుకూడా కలదు. అందుకే నాటిరచయితకథలలో నాకు పరిచయమున్న పాత్రలు తోచడమేకాకుండా, నేను వేసే ప్రశ్నలు చాదస్తమని యథార్థం నాదగ్గర చెప్పకుండా యింకొకరిదగ్గర చెప్పడంకూడా యీనాటి నాటికథకుల కథలలో గోచరిస్తుంది.

వచ్చిన జనులు నిశ్శబ్దంగా ఒకరితరువాత యింకొకరు తమ జీవితవిశేషాలు చెప్పడానికి బదులు అంతమందీ కలిసి గోలచేస్తే నాకు బహు చిరాకు గలిగి, సమాధానా లీయకుండా, గోలచేస్తే అంతమందీకూడా దయ చెయ్యవచ్చునని శాసించేవాడను.

నాకొరకు వచ్చే జనులలో నాస్మృతిపథము వీడిపోని ఒక ముదుసలి పదేపదే జ్ఞాపకానికి వస్తాడు. నాతో ముచ్చటిద్దామని ఎంతోదూరంనుంచి ఆవయస్సులో వచ్చేవాడంటే నా కెంతో జాలి వేస్తుంది. అత నొక చిన్న వీధిబడిలో ఉపాధ్యాయుడు. మొదటి అసహాయోద్యమపురోజులలో భారతమాతమీద పాటను రచించిన నేరంమీద జైలుకు పోయి, తిరిగివచ్చి, ఉపాధ్యాయవృత్తి చేసుకుంటూ కాలం గడిపేవాడట. నేను పెద్ద జబ్బుపడి, పథ్యంపుచ్చుకొని నాగదిలోకి వచ్చినరోజునే నాగదిలోకి హాజరై "తమ రేమీ అనుకోకుండాఉంటే గదిలోకి వస్తా" నని స్వాదుగా నవ్వుతూ అని "దయచెయ్యండి!" అని నేను గౌరవంగా పిలిచినపిమ్మట వచ్చికూచొని తన జీవితకథ అంతా చెప్పాడు. అతని గాత్రం తంబురాశ్రుతిలా మందరంలో మధురంగా ఉండేది వినేందుకు. అతనిని నా'పాతపాట'అనే చిన్నకథలో పాత్రగా వినియోగించి మృత్యువును ప్రసాదించాను.

*   *   *   *

క్రిందటి ఆదివారం సాధారణంగా జనులందరూ వచ్చి నాకోసం ఎదురుచూస్తూ కూర్చునే గదిలోకి నేను వెళ్లడం చాలా ఆలస్యమైంది. ఆశనివారం రాత్రి నా కొక స్నేహితుడు తాను రచించి పంపిన నవల చదువవలిసిన బాధ్యత నామీద ఉండటంచేత ఆగ్రంథపఠనంలో రాత్రిమూడుగంటలవరకూకూడా నేను మేలుకొని ఉండవలిసివచ్చింది. యింతేగాక, ఆగ్రంథంలో వచ్చిన పాత్రలలో ఒక పాత్ర నేను నిశితముగా ఆలోచించవలిసిన అవకాశం కలిగించింది. అనేకమృతపాత్రల మధ్య ఆ ఒక్కపాత్రే సజీవమైనదై యుండటంచేత నేను రాత్రిలో ఎక్కువభాగం మేల్కొనిఉండవలిసిన అవస్థ తటస్థించింది. అందుకే ఆ ఆలస్యం.

ఆపాత్ర ఒక ముసలిబడుగు. పేరు విజ్ఞానకోవిద గురునాథరావు. అతను ఒక మందు కనిపెట్టి

నాడట. ఆమందు సేవించడంవల్ల మానవక్లేశం మటుమాయమవుతుందట. ఆమందు సేవించడంవల్ల తనకే కాదు మానవకోటికంతటికీ బాహ్యంగాగాని, ఆంతరంగికంగాగాని, ఎంతటిప్రబలవిపత్తులోనున్నా అది పటాపంచలయిపోవడమేకాకుండా, అందులో హృదయాని కొక ప్రశాంతత ప్రసాదించగల గుణముందట.

విజ్ఞానకోవిద గురునాథరావుగారు విశ్వశ్రేయస్సుకోసం లోకానికి ప్రసాదించినది మందనడంకంటే ఒక మహాసూత్రమంటేనే ఎక్కువ ఔచిత్యముంటుంది. అదేమిటయ్యా అంటే, ప్రతిమానవుడూ ప్రత్యూషాన్న ప్రారంభించి రాత్రి అయ్యేవరకూ దేశచరిత్రలు చదువుతూ, వర్తమానకాలాన్నికూడా గతించిన పురాణనిశ్శబ్దంలోకి విసరివేయడం. యిటువంటి దృష్టి తాను అలవరచుకోడంచేత సమస్తవిచారాలనూ విస్మరించిఉండగలగటమే కాకుండా మృత్యువునుకూడా జయించాడట. కాని ఆతనిని ఒక విషాదచ్ఛాయ ఆవరించుకొంది. అది ఎటువంటి దంటే, భావిలో పుట్టబోయే మానవులందరూకూడా యిప్పుడే నశించినా, మహాప్రస్థానాలలో నిండి నిబిడీకృతమైయుండే మృత్యుశైతల్యం, సుప్తచైతన్యం.

భూతకాలఆదర్శాలను వర్తమానకాలానికి నప్పటం విజ్ఞానకోవిద గురునాథరావుగారు కలలోనైనా సహించలేరు. అట్లు చేయడం కాలాన్ని ఖరాబుచెయ్యడమని ఆయననిశ్చితాభిప్రాయం. దేశచరిత్రలంటే, కాలానికి చెందిన ముఖ్యాంశాల ఆదర్శరచనలయిఉండటంచేత అవి చరిత్ర రచించినవారి అనుభవాలూ, రుచులూ, యిష్టాయిష్టాలూ, ఊహలూ, ఉబలాటాలతోనిండి పఠితకు ఆదర్శరచనను అవగాహనచేసుకొనేందుకు అడ్డంకిఅవుతున్నాయి. నైసర్గికరచనకు చెందిన ముఖ్యాంశాలు చిందరవందరగా చెదరకొట్టబడి, హద్దుమీరి కట్టుతెగిన వవుతున్నాయని వారి వాదన. వర్తమానసిద్ధాంతాలవల్ల భావిఫలాలను నిర్ణయించడం ఎంతమాత్రం అంగీకరించడు. యిందుకు వ్యతిరిక్తం ఆయనమతం. ఉద్భవించని భావిలో తాను ఉన్నాననుకొనడం, వర్తమానకాలాన్ని నచ్చచెప్పుకోవడం, వర్తమానమే భూతమని భ్రమించడం ఆయన అలవాటు.

ఇందుకు ఒక ఉదాహరణ: కొద్దిరోజుల క్రితం ఆతని కూతురు ఒక చంటిపిల్ల గతించింది. పరామర్శించేందుకు ఒక స్నేహితుడు ఆతని దగ్గరకు పోతే, అతడు ఆకూతురు ఏవందసంవత్సరాలక్రితమో గతించినట్లు భావించి ఆవిచారాన్నే విస్మరించాడు. ఆయనకు సంభవించిన గర్భదుఃఖం నవనవమేఅయినా, దాన్ని భూతకాలంలోకి నెట్టేసి కాలాంతరాళకుహరంలోకి విసరగలిగాడు. అంతమాత్రంచేత తనకు గలిగిన విచారాన్నిగురించి ఉదాత్తంగా మాట్లాడేందుకుమాత్రం ఆయనకు ఎంతమాత్రమూ అభ్యంతరం లేదు.

ఇంతెందుకు? గురునాధరావుగారు తన మనస్సును ఒక సూక్ష్మదర్శినిగా చేసుకోగలిగారు. సూక్ష్మదర్శినితో మనం క్రిమికీటకాలను దర్శిస్తాము. సూక్ష్మదర్శినికి రెండు అద్దా లుంటాయి: ఒకటి చిన్నది; రెండవది పెద్దది. పెద్ద అద్దంక్రింద స్వల్పమైనదాన్నుంచి చిన్న అద్దంలోనుంచి చూస్తే అది పెద్దదిగా కనపడుతుంది. చిన్న అద్దంక్రింద ఘనమైనదాన్నుంచి, పెద్ద అద్దంలోనుంచి చూస్తే అది స్వల్పముగా కనపడుతుంది. ఆయన మనస్సూక్ష్మదర్శినితో పెద్ద అద్దంతో వర్తమానాన్ని వీక్షించడంచేత వర్తమానం అల్పంగా తోచేది. దీనికి తోడు ఆయన ఒక ఉద్గ్రంథరచనకూడా ప్రారంభించాడు. దానిపేరు 'దూరతత్వం'. యీ గ్రంథం ప్రజాబాహుళ్యంలో అల్లకల్లోలం కలిగించకతప్పదు.

నేను ఆ నవల చదువుతున్నంతసేపూ ఆ రచయిత చక్కని కథాసంవిధానంకోసం పాటుపడటంలో యీ పాత్రలో ఎంత సజీవిత ఉన్నా అవగాహన చేసుకోలేకపోవడం గురించి ఎంతో విచారించాను. అదొక బూతుకథే అయినా, కథాసంవిధానాన్ని తప్పించుకొని యీ పాత్ర తన నైసర్గిక గంభీరతను చూపించుకున్నాడు. అయితేనేం, పాపం కథను ముగించేందుకు రచయిత యీ పాత్రను అసహజంగా మరుగుపరచి పీకనులిపి ఖూనీచేశాడు. కావ్యజగత్తులో కాబట్టి ఫరవా లేకపోయింది. వాస్తవికవిశ్వంలో అయితే అది ఎంత గొప్ప నేరము? ఆ నవల చదువు

తున్నంతసేపూ, నామనోవేగాన్ని తన చలనంచేత నిలిపిన ఆ పాత్రనే తలుచుకుంటూ నేను ఎంతోసేపు ఆగాను ఆ మానవిభావరిలో! పాపం! రచయిత యీ పాత్రను అపార్థం చేసుకోకుండాఉంటే ఈ పాత్ర నాధారము చేసుకొని ఒక మహాకావ్యమును అల్లేందుకు అవకాశ ముండియుండును. ప్రధాన పాత్రగా స్వీకరిస్తే కథ కుండే కృతకత లేకపోవును సరి కదా, కృతకతంతా జీవంగా పరిణమించియుండును. రచయిత పాత్ర కొక పరిపూర్ణతను ప్రసాదించలేక పోయాడు కదా అని నాకు వెగటూ, విచారం కలిగాయి. కాని ...

* * * *

నేను గదిలోకి ప్రవేశించేసరికల్లా నాకోసం కనిపెట్టికొనియున్న జీవపాత్రలలో ఒక కలకలం రేగింది. ఏమి టీకలకలమని వీక్షించేసరికి విజ్ఞానకోవిద గురునాథరావుగారి ఆగమనం! అక్కడ ఉన్నవారిని తోసుకుంటూ, అలజడిచేస్తూ ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తూఉంటే ఉన్నవారందరూ చీదరించుకొని, ఆగ్రహించి,అతగానిని పైకినెట్టేప్రయత్నంలో ఉండగా నే నది కనిపెట్టి యిల్లా అందుకున్నాను: "అయ్యా! ఎందుకండీ యిక్క డీగడబిడ? కారణ మేమిటో నా కేమీ అర్థంకాలేదు....గురునాథరావుగారా! ఏమిటి మళ్లా యీసాక్షాత్కారం? తమనుగురించి నేను చాలా కాలం వ్యర్థంచేశాను. మీరు నావారు కారు. తమరు దయచేస్తే నేను నాపాత్రలతో ముచ్చటించుకోవాలి. సెలవుపుచ్చుకోండి" అని నే ననేసరికి గురునాథరావుగారి ముఖం వివర్ణమైంది. విషాదచ్ఛాయలుకూడా అలముకొన్నాయి. నాకోసం వచ్చిన జనుల హృదయంలో కరుణ రేకెత్తింది. "అయ్యా! నన్ను పొమ్మనకండి, యీజనులు అనుమతిస్తే నా చిన్న విన్నపము వినేందుకు అయిదునిమిషాలు అవకాశ మియ్యండి. అంతే మిమ్ములను నేను కోరుతున్నది, క్షమించండి" అని గద్గదికతో అనేసరికి చకితుడనై, జాలిగా నే నిట్లా అన్నాను: "చెప్పుకోండి ఏమిచెప్పుకోవలెనని ఉందో. కాని నాకు తెలుసు, తమకు సంభవించిన కష్టం. అందుకు నా సానుభూతి. మీవంటివారు అంతకంటే ఉత్తమరచయితచేతిలో పడిఉండవలిసింది. కాని జరిగింది అన్యాయం. నిట్టూర్చడంకంటె, విచారించడంకంటె నేను చేయగలిగిన దేముంది మీకు?"

"అంతేనా మీరు నాకు చేయగలిగింది? కాదు! సర్వేశ్వరుని సాక్షిగా చెబుతున్నా, వినండి." అని అతను తిరిగీ అనేసరికి ఆతని శరీరం కోపంతో గజగజ వణుకుతున్నది. "మీ వ్రేలికొనల జారిపడిన జీవకణం నుంచి ఉద్భవించినవాణ్ణికాననీ, అన్యుల సంతానాన్నని కదా మీ ఉపేక్ష! శివ శివ! నాయెడల మీరు అధికమైన జుగుప్స చూపియుండినా, నాకు ఎక్కువ ఆనందాన్ని యిచ్చియుండెడిది, యిప్పటి యీ నిరాదరణమైన జాలికన్న. నిజమైన కళాద్రష్టకు యిది కళంకమంటాను. యీకాలపు రచయితలలో పాత్రల నవగాహనచేసుకోవడంలో మీరు మహానుభావులు. మీకు తెలుసు వాస్తవికమానవులకంటే మేము సజీవులమని. రక్తమాంసాలకు కానివారమైనా మాలో ఎక్కువ సత్యం ఉందని. యీప్రపంచంలో మన ఉత్పత్తి రకరకాలు. ప్రకృతి మానవహృదయసహాయంతో కొంత సృష్టి సల్పుతున్నది. స్త్రీగర్భజనితులైన మానవులకంటె మానవ మానసపుత్రులమైన మా జీవితములు ఉత్కృష్టములు. పాత్రగా పుట్టినవాడికి, సజీవపాత్రగా జనించినవాడికి శాశ్వతత్వం ఉంది; మృతి లేదు. మానవుడికి చావు ఉంది. రచయితకు చావు ఉంది. రచయిత అంటే పాత్రమాతృక. కాని పాత్రమాత్రము మృత్యుంజయుడు. మృత్యుంజయత్వము అలవడేందుకు తపస్సు అక్కరలేదు; మార్కండేయుడు కానక్కరలేదు. చెప్పండి: శకారు డెవరు? వసంతసేన ఎవరు? అవి పాత్రలేఅయినా వాటికి శాశ్వతత్వం వచ్చింది! ఎందుచేత? ఉత్కృష్టరచయిత మానసక్షేత్రమున వ్రాలిన పటుతరబీజాలవటంచేత."

"అవును, గురునాథరావుగారూ, మీరు చెప్పినదంతా యథార్థం. కాని, నానుంచి మీకు కాదగినదేమిటో నా కవగతమవలేదు" అని నే ననేసరికి, గురునాథరావుగారు మరల అందుకొని—

"అవగతమవలేదా? నేను రాకూడని స్థలానికి వచ్చానా? నేను వెఱ్ఱివాణ్ణా?...మీ రేమి రచయితలండి! నాకు జరిగిన ఘోరం, నాజీవితోదంతం ముమ్మాటికీ

అవగాహనకాలేదని మీహృదయంమీద చెయ్యివేసి చెప్పగలరా? యీరోజులలో—మానవజీవితాలే మరుగుజ్జుగా, సొట్టపోయి నొక్కులుపడుతున్న యీరోజుల్లో పాత్రగా పుట్టగలిగిన అదృష్టవంతుణ్ణి. సజీవ పాత్రగా పుట్టగల పునీతుణ్ణి. నాకు లభించిన కొద్దిఅవకాశంలోనూ నా కొక శాశ్వతత్వం కలదు. ఎన్నుంటే ఏం? నాదురదృష్టంవల్ల ఒక దౌర్భాగ్యుని చేతిలో పడటంనుంచి అన్యాయంగా అధోగతిపాలయ్యాను. అసహజలోకనివాసినై అటమటించవలసి వచ్చింది. ఊపిరాడకుండా ఉంది. విరివిగా సంచరించేందుకు వీల్లేకపోతున్నది. అయ్యో! అంతా అసహజత, కృత్రిమం, దీర్ఘం. కౌగితాలు పదాలు, పదాలు కౌగితాలు! మానవునకే యింత కష్టభూయిష్ఠమైన బ్రతుకే సంభవిస్తే పలాయనం చేస్తాడు—కౌగితాలనుండి, పదాలనుండి. కాని పూర్వజన్మసుకృతంచేత పాత్రనై పుట్టాను. అందుచేత కాలాంతంవరకూ కష్టాలు పడవలసిందే. అయ్యో! ఊపిరాడదు! గాలి! గాలి! జీవనం!

"లేకపోతే చూడండి, గురునాథరావని నామకరణమే ఎంత అసహ్యంగా చేశాడో! పశువు! సరియైన నామకరణమైనా చేయలేడు. గురునాథరావట, చచ్చు! 'దూరతత్వం' రచించిన నాఅంతటివాడిదగ్గరకు ఎందుకు రావాలి? చచ్చినవాడు! తన చచ్చు బంకమంటి కథాసంవిధానంలో కలిగే చిక్కులు నాచేత విప్పించి నన్ను దగ్ధంచెయ్యాలా? వాణ్ణి సమర్థించేందుకు ప్రయత్నించడం మంచిదా? అతను చేసిన పాతకానికి అతని రక్తం చవిచూస్తేనేకాని నా కార్పణ్యం తీరుతుందా? రాగాపోగా యిప్పుడేమి సంభవిస్తుంది?...ఏముంది సంభవించేందుకు? అంతా నిశ్శబ్దం! నీరవం! కాకపోతే ఒకటిరెండు పత్రికలలో పత్రికా విమర్శకుడు యిట్లా 'గురునాథరావుపాత్ర ఉత్కృష్టమైనదే. కాని జరిగిన అన్యాయానికి, పాపం, జాలివేస్తుంది!' అని వ్రాస్తాడు. అంతే! అంతకంటె ఏముంది? ఆశ్వాసాంతం,ఆఖరు! చేతులారా చేశాడు ఖూనీ.'దూరతత్వ'ఉద్గ్రంథరచయితను చంపిన మొద్దు గ్రంథాన్నే నా ప్రకటించడా? లేదే? అమ్మమ్మ! తలుచుకుంటే భయమేస్తుంది! మీకన్నీ తెలుసు. సర్వజ్ఞులు, ప్రాణదానం చేయండి. మిమ్మల్లను ప్రార్థిస్తున్నాను."

అని ఉద్రేకంగా అని నిర్ఘాంతపోయి నాముఖం చూస్తూ "నాతండ్రి రచయితను నొప్పిస్తుందనితలచకండి" అని మళ్లా అంటున్నాడు. "అతను బాధపడతాడనా? నేను చెప్పింది న్యాయం! మీరుమాత్రం ధర్మ మని తలచరా? నన్ను మీరు తమ సంతానంగా స్వీకరించి ఉద్ధరించండి. ఆ చచ్చు అవగాహనచేసుకోలేకపోయిన నా యథార్థజీవితాన్ని నాకు ప్రసాదించండి. అది నాజన్మహక్కు! మీది కూడాను! యిప్పటికి నాసంగతి నేను పూర్తిగా చెప్పుకున్నాను. తరువాత మీదయ, నా అదృష్టం."

నేను:— అందుకు నాజవా బేమి టంటారా? అది మీ హక్కు. మీ రన్నట్లు న్యాయమైనదికూడాను. అట్లాంటి పనులు చేయడం నామతం కాదు. ఒకరి సంతానాన్ని నా దెట్లు చేసుకోడం, చెప్పండి? మీ రెంత వాదించినా ప్రయోజనంలేదు. నే నొప్పను. మీరు దయచేసి మరొక రచయితను చూచుకోండి.

గురునాథరావు:—మీరే అల్లా అంటే యింకెవరి దగ్గరకు పోవడం?

నేను:—మీరు చెప్పిన వాదం ఒప్పుకొని, మీ రంటున్న హక్కు సమంజసమని తలచే నాబోటివాడు యింకొకడిదగ్గరకు. చూడండి! చిన్న ఉపదేశం ఒకటి చేయాలని బుద్ధిపుట్టింది. మీరు యథార్థంగా 'దూరతత్వం' రచించినవారు అవునా కాదా చెప్పండి.

"ముమ్మాటికీ నేనే!" అంటూ ఉత్సాహంతో లేచి, తను యథార్థమే పలుకుతున్నానని తెలుపుదు చేసేటట్లు హృదయంమీద చేతిని ఆనించుకుంటూ "నేనుకాక ఎవరండి? మీ రనుమానించడం ఏమైనా భావ్యంగా ఉందా? మీ రల్లా తలచేందుకు కారణం నాకు తెలుసు, నన్ను వధచేసిన ఆదుర్మార్గుడినుంచి నా కొచ్చిం దీముప్పు. నేను కనిపెట్టిన సూక్ష్మదర్శిని గురించి విపులంగా చెప్పడం మాని, ఏదో సంకుచితంగా నాసూత్రాలమీద కొట్టిపారేశాడు." అంటూ నాదగ్గరకు చేరేసరికి, నేను ఒక చిన్న మందహాసం చేస్తూ, "మంచిది! మీరెందు కల్లా ........." అన్నాను.

గురునాథరావు:— నేను ఎల్లా ...

నేను:— మీ రెందుకయ్యా మీ రచయితమీద దుఃఖపడ్డం! నీవు లోకాని కొసగిన మహామంత్రాన్ని నీకే అన్వయించుకోలేకపోతే! యిదే నేను నీకు చెప్పదలచుకున్న గుణపాఠం. నీకు బోధపరుస్తా విను. నీచే రచింపబడిన తత్వమందు నీకే గనక నమ్మక ముంటే, స్వవిషయంలో దాన్ని ఎందుకు ప్రయోగించ లేకపోతున్నావు? యీ నవ్యసాహిత్యపు రోజులలో రచయితలం శాశ్వతత్వం యీయ లేకపోయామని తప్పు పడుతున్నావు! యీ నాటి విమర్శకులు మాబోటి నవ్యసాహిత్యపరులనుగురించి ఎంత చులకనగా, హేళనగా వ్రాస్తున్నారో గమనించావా? మమ్మల్ని లోకులు గుర్తించీ గుర్తించరు. విజ్ఞానకోవిదుడవు మళ్లాను! మీరు నవ్యసాహిత్యపరులు చేస్తున్న పనినే ఏల చేయరు? యీ నాడు జరిగే గొప్ప విశేషాలు, అద్భుతోదంతాలు, హృదయాన్ని మండించే ఘాటైన క్లిష్టసమస్యలతో రచింపబడే రచనలను కూడా మీరు స్వంతంగా తయారుచేసుకున్న, తలక్రిందులు చేయబడిన హృదయసూక్ష్మదర్శినితో తిలకిస్తే మీ కేమి గోచర మవకుండా ఉంటాయా. మీ రెందు కల్లా చేయరు? తప్పక అల్లా చేయండి! మీకు తటస్థపడ్డ పరిస్థితులతో మీరు సంతృప్తిపడండి. మిమ్మలను మీరే ఓదార్చుకోండి. దయచేసి నాజీవపాత్రలతో నన్ను ముచ్చటించుకోనీండి. వారి ఆదర్శాలలో ఔన్నత్యం లేకపోయినా వారు నిరాడంబర సంతుష్ట జీవులు.

